సాక్షి శ్రీకాకుళం

గురువారం । 17 । ఆగస్టు । 2023



దిగుబడికి రాచబాటలు

వరిసాగులో కాలిబాటలు లాభదాయకమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మంచి దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. - 8లో



పోర్టు వాహనాల అడ్డగింత

మూలపేట పోర్టు పనులకు వెళ్లే వాహనాలను నిర్వాసితులు అడ్డుకున్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడపడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. - 8లో

నేడు బోర్డాఫ్ స్టడీస్ సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం బోర్డాఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించనున్నట్లు డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రధాన సెమినార్ హాలులో సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు, విభాగాధిపతులు, బోర్డాఫ్ స్టడీస్ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

న్యూస్‌రీల్

జవహర్ నవోదయ గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా, ఈ నెల 26, 27 తేదీల్లో దరఖాస్తుల్లో వివరాలు సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా సిక్కోలు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి లక్ష్మీతులసీ

జలుమూరు: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అమలులో శ్రీకాకుళం జిల్లాను రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి అన్నారు. బుధవారం జలుమూరు మండలం ఊడికలపాడులో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉచిత మందులు, 24 గంటల వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జలుమూరు వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు చేసుకునేందుకు తక్షణమే అవకాశం కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శాఖాధిపతులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కేటాయింపుపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాజేంద్రప్రసాద్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2021–22 విద్యా సంవత్సరం మాదిరిగా ప్రభుత్వ శాఖాధిపతులకు కేటాయించిన తరహాలో విద్యార్థులను ఇంటర్న్‌షిప్ కోసం తీసుకోవాలన్నారు. ఈసారి 6,352 మంది విద్యార్థులను 24 శాఖలకు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో 2,433 మంది సచివాలయాలకు, 2,206 మందికి విద్యాశాఖకు, 556 మందిని వైద్య, ఆరోగ్య శాఖకు కేటాయించినట్లు వివరించారు. ఈ నెల 18 నుంచి ఇంటర్న్‌షిప్ ప్రారంభం కావాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, జిల్లా సరఫరాల అధికారి డి.వెంకటరమణ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో నేరాల నియంత్రణకు కృషి




రైల్వే పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రైల్వే, సివిల్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తేనే రైళ్లలో నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైల్వే ప్రయాణికుల భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైళ్లు, ప్లాట్‌ఫామ్‌లు, స్టేషన్ల ఆవరణలో నేరాల నియంత్రణకు గస్తీలు పెంచాలని సూచించారు. రెండు బృందాలుగా బీట్ తిరిగేందుకు సిబ్బందిని కేటాయిస్తానని, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా తిరుగుతూ రైలులో అపరిచిత వ్యక్తులు, అనుమానితులను గుర్తించి అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజలకు, ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు వై.శృతి, ఎస్.బాలరాజు, ఎస్‌బీ సీఐ లక్ష్మణమూర్తి, పలాస ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.కె.సమాల్, శ్రీకాకుళం రోడ్డు, పలాస జీఆర్పీ ఎస్‌ఐలు శ్రీనివాస్, షరీఫ్ పాల్గొన్నారు.



ఉపాధిలో 1 నంబర్

- పథకం అమల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో సిక్కోలు
- వలసల నివారణే లక్ష్యంగా పనుల నిర్వహణ
- పనుల కల్పనలో అగ్రస్థానం
- నిధుల వినియోగం, వేతన ఖర్చులో ముందంజ



సాక్షిప్రతినిధి,శ్రీకాకుళం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో సిక్కోలు జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిచింది. వలసల నివారణే లక్ష్యంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించి ఆర్థికంగా ఆదుకోవడంలో మొదటి స్థానంలో ఉంది. పని కోరిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పించి, సుస్థిర మౌలిక వసతులు, సామాజిక, ఉమ్మడి ఆస్తులు ఏర్పాటు చేయడంలో మేటిగా నిలిచింది. దాదాపు మూడు అంశాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండగా, ఒక అంశంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాలో 4.33 లక్షల మందికి జాబ్‌కార్డులుండగా అందులో 3.22 లక్షల కుటుంబాలకు పని కల్పించి వలసలు నియంత్రించడంలో ముఖ్య భూమిక పోషిస్తోంది.

ఆదుకుంటున్న ఉపాధి పనులు

ఖరీఫ్, రబీ ముమ్మర సీజన్‌లో వ్యవసాయ పనులు దొరికినా, మిగతా సమయాల్లో కూలీ పనులపై ఆధారపడ్డ వారికి ఉపాధి పనులే పెద్ద దిక్కు అవుతున్నాయి. విరామ సమయంలో వలసపోకుండా ఉపాధి పనులు నియంత్రిస్తున్నాయి. గ్రామంలోనే పనులు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వెరసి వేతనదారులు ఊరట చెందుతున్నారు. ఎక్కడికో వెళ్లి పని చేయడం కన్నా ఉన్న ఊరిలో పనులు చేసుకుని, పిల్లల్నే ఇక్కడే చదివించుకోవాలన్న ఆలోచన పెరిగింది. దీంతో ఉపాధి పనులకు హాజరవుతున్న వారి సంఖ్య రాష్ట్రంలో మన జిల్లాలోనే ఎక్కువగా ఉంది. వేతనదారులకు పని కల్పించడమే కాకుండా శాశ్వత ఆస్తులను సమకూర్చే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. తూతూ మంత్రపు పనులతో సరిపెట్టకుండా చెరువులను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు స్లూయిజ్, సర్ప్లస్ వియర్, చెరువు గట్లు పటిష్టం, ఇరిగేషన్ కెనాల్స్ పటిష్టం, చెరువు గట్లుపై మొక్కలు నాటడం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, చెత్త నుంచి సంపద వేరు చేసే కేంద్రాల నిర్మాణం వంటి శాశ్వత పనులను చేపట్టి ఆస్తులను సృష్టిస్తోంది.

చిరస్థాయిగా పనులు

ఒకవైపు వేతనదారులకు పని కల్పిస్తూనే మరోవైపు మెటీరియల్ కాంపోనెంట్ కింద మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చడం నిధుల ఖర్చుకు సార్థకత కలుగుతోంది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, బీటీ, సీసీ రోడ్లు, పాఠశాల భవన నిర్మాణాలు, సిమెంట్ కాలువల నిర్మాణం వంటి పనులతో గ్రామాల్లో కళ్ల ముందే శాశ్వత ఆస్తి కనిపిస్తోంది. నా భూమి నా దేశంలో భాగంగా 912 గ్రామ పంచాయతీల్లో 75 చొప్పున మొక్కలు నాటారు. 1160 ఎకరాల్లో జీడి మామిడి, కొబ్బరి, మామిడి, సపోటా, నిమ్మ, పామాయిల్, మునగ తోటల పెంపకంతో రైతులకు ఉపాధి దొరకడమే కాకుండా ఉద్యానవన తోటల అభివృద్ధికి దోహదపడుతోంది. అమృత్ సరోవర్ కార్యక్రమం కింద 86 చెరువులను అభివృద్ధి చేశారు.

రాష్ట్రంలో ఫస్ట్

- ఉపాధి హామీ పథకం అమల్లో అనేక అంశాల్లో రాష్ట్రంలో జిల్లా మొదటి వరసలో నిలిచింది.
- పనుల కల్పనతో పాటు వేతనదారుల వేతన ఖర్చు, ఉపాధి హామీ పథకం నిధులు వినియోగంలోనూ తొలిస్థానం సాధించింది.
- వేతనదారుల కుటుంబాలకు 100 రోజుల పని కల్పనలో మాత్రం ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.

జిల్లాలో జారీ చేసిన జాబ్ కార్డులు	4.33 లక్షలు
ఉపాధి వేతనదారుల కుటుంబాల సంఖ్య	3.22 లక్షలు
కల్పించిన పనిదినాల సంఖ్య	154.35 లక్షలు
ఆగస్టు 8వ వరకు చేసిన వేతన ఖర్చు	రూ.389.65 కోట్లు
ఉపాధి పనుల కోసం చేసిన ఖర్చు	రూ.497.33 కోట్లు

మొదటి స్థానంలో ఉన్నాం..

ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టడంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నాం. రాష్ట్రంలోనే అనేక అంశాల్లో మొదటి స్థానంలో ఉన్నాం. కోరిన ప్రతీ ఒక్కరికీ గ్రామంలోనే పనులు కల్పిస్తున్నాం. నిధులు వినియోగంలోనూ ముందున్నాం. వేతనదారులు, సిబ్బంది సహకారంతో మంచి ఫలితాలను సాధించాం.

– బి.వి.చిట్టిరాజు,
జిల్లా జల యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్.

స్థానికంగా పరిశ్రమలు.. తగ్గుతున్న వలసలు



రాష్ట్రంలో అత్యంత వెనకబడిన జిల్లా మనది. వ్యవసాయ, కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య ఎక్కువ. గతంలో ఇక్కడి నుంచి దేశం నలుమూలలకే కాకుండా విదేశాలకు కూడా ఉపాధి కోసం వలసపోయిన పరిస్థితులు ఉండేవి. ఇప్పుడా పరిస్థితులు తగ్గుముఖం పట్టాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడమే ప్రధాన కారణం. జిల్లాలో కొత్తగా ఏర్పడిన పరిశ్రమలతో పాటు ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో వేలాది మందికి ఉద్యోగాలొచ్చాయి.

- జిల్లాలో 1610 కోట్ల పెట్టుబడితో నడుస్తున్న 20 భారీ పరిశ్రమల్లో 6,943 మందికి ఉపాధి కల్పించారు.
- రూ.1170కోట్లతో మరో 4 భారీ, మధ్య తరహా పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణంతో కొందరికి ఉపాధి దొరకగా, పూర్తయితే మరో 1500మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి.
- 2022–23లో రూ. 292.61కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఎంఎస్‌ఎంఈల ద్వారా 13,651మందికి ఉపాధి దొరికింది.
- 2023–24లో రూ. 112.22కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 862ఎంఎస్‌ఎంఈల ద్వారా 3500 మందికి ఉపాధి కల్పించినట్లు అయింది.

శ్రావణం.. శుభప్రదం!

- నేటి నుంచి శ్రావణమాసం
- లక్ష్మీదేవి పూజలకు సిద్ధమైన మహిళలు
- సందడిగా మార్కెట్లు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి

శ్రీకాకుళం కల్చరల్: సకల శుభాలకు నిలయమైన శ్రావణమాసం వచ్చేసింది. ప్రధానంగా ఈ నెలలో వచ్చే శుక్రవారం నాడు మహిళలు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. కుటుంబమంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ లక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో మొదటి శుక్రవారం 18న, మొదటి మంగళవారం 21న ప్రారంభమవుతాయి. ఈ ఏడాది శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు, నాలుగు మంగళవారాలు కావడంతో పూజలకు మహిళలు సమాయత్తమవుతున్నారు. అధిక శాతం మంది ఆగస్టు 25న వరలక్ష్మీ వ్రతం చేయనున్నారు. ఆ రోజు అమ్మవారిని పూజిస్తే తమ కుటుంబానికి ఆయురారోగ్యాలు సమకూరుతాయని మహిళల నమ్మకం.

ఆలయాలు సిద్ధం..

శ్రావణమాసం సందర్భంగా పలు అమ్మవారి ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో సిద్ధం చేస్తున్నారు. పాతశ్రీకాకుళంలో సంతోషిమాత ఆలయం, గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారు, పాతబ్రిడ్జి వద్ద కనకదుర్గ ఆలయం, రెడ్డిక వీధిలో విజయదుర్గాదేవి ఆలయం, చిన్నబజారులో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, కొత్తబ్రిడ్జి వ చిం దత్తనాథ క్షేత్రంలో గాయత్రీ మాత ఆలయం, గోవిందనగర్‌కాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. బలగ నాగావళి తీరాన ఉన్న బాల త్రిపుర కాలభైరవాలయంలో ప్రతి శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జోరుగా పూల అమ్మకాలు..

శ్రావణ మాసంలో వరలక్ష్మీదేవికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేస్తుంటారు. ఇందుకు పూల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో పూల అమ్మకాలు జోరందుకున్నాయి. చేమంతులు కేజీ రూ.800, గులాబీలు కేజీ రూ.600, బంతిపూలు కేజీ రూ.500, విరజాజులు కేజీ రూ.వెయ్యి, కొబ్బరికాయలు రూ.30, అరటిపళ్లు పెడ రూ.80 చొప్పున అమ్ముతున్నారు.

తొమ్మిది అవతారాలలో అమ్మవారు..

శ్రీకాకుళం నానుబాల వీధిలో విజయదుర్గ ఆలయంలో 9 విశేష అవతారాలలో అమ్మవారి దర్శనం ఉంటుందని అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ తెలిపారు. 18న ఆదిలక్ష్మిగా, 22న ధాన్యలక్ష్మిగా, 25న ధైర్యలక్ష్మిగా, 29న గజలక్ష్మిగా, సెప్టెంబర్ 1న సంతాన లక్ష్మిగా, 5న విజయలక్ష్మిగా, 8న విద్యాలక్ష్మిగా, 12న ధనలక్ష్మి అవతారంలో దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు.



మార్కెట్లో పూల అమ్మకాలు

ఎక్కువ కేసుల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా నుంచి ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు ప్రయోజనం చేకూర్చాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఇన్సూరెన్స్ అధికారులు, మోటార్ వెహికల్ ప్రమాదం కేసుల పిటిషనర్ అడ్వకేట్స్, బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సమస్యల బాధ్యత ఈఆర్‌ఓలదే



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాల్లోని సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఈఆర్‌ఓ(ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్)లదేనని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ స్పష్టం చేశారు. ఓటర్లు సవరణ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా ముందుగా ఈఆర్‌ఓ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటింటి ఓటర్ల సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో 5వ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 8 శాసన సభ నియోజకవర్గాల పరిధిలో 18లక్షల 6వేల 841మంది ఓటర్లకు గాను, గత నెల 21 నుంచి జరిగిన ఇంటింటి సర్వేలో ఇప్పటివరకు 12 లక్షల 53 వేల 399 మంది ఓటర్లను గుర్తించి 69 శాతం ప్రక్రియ పూర్తిచేసినట్లు వివరించారు. ఇంకా ఆరు రోజుల గడువు ఉన్నందున మిగిలిన సర్వేను త్వరగా పూర్తిచేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు కొత్త ఓటర్లుగా 26,137 మంది దరఖాస్తు చేసుకోగా 11,682 మందివి పూర్తయ్యాయని, మిగిలినవి పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నారు. తొలగింపుల కోసం 15,293 మంది దరఖాస్తులు రాగా, అందులో 10,948 పూర్తిచేశామన్నారు. సవరణల కోసం 63,823 దరఖాస్తులు అందాయని, వాటిలో 19,666 పూర్తికాగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. అత్యధికంగా ఓటర్ల తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదైన పోలింగ్ స్టేషన్లను స్వయంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ, టీడీపీలు పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్‌ఓలను నియమించుకున్నాయని, మిగిలిన పార్టీలు కూడా బీఎల్‌ఓలను నియమించుకోవాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ఓటర్లను తొలగిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక ఉప ఎన్నికలకు వేళాయె..!

- ఈ నెల 19న నాలుగు సర్పంచ్‌లు, 12 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్
- అదే రోజు ఫలితాలు వెల్లడి
- 13 మండలాల పరిధిలో 20 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- బ్యాలెట్ విధానంలోనే పోలింగ్



అరసవల్లి: జిల్లాలో స్థానిక ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 19న 13 మండలాల పరిధిలో నాలుగు సర్పంచ్ స్థానాలు, 12 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వాస్తవానికి ఈ నెల 6న ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు జిల్లాలో 6 సర్పంచులు, 96 వార్డు సభ్యుల స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే నిబంధనల ప్రకారం సర్పంచ్‌ల స్థానాల్లో పట్టుపురం పంచాయతీ సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు కాలేదు. ఆమదాలవలస మండలం అక్కివరం పంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమయ్యింది. దీంతో మిగిలిన నాలుగు సర్పంచ్ స్థానాలైన బొప్పడాం (సరుబుజ్జిలి), అన్నాపురం (నందిగాం), భద్రి (సారవకోట), పెదలంకాం (బూర్జ)లో పోలింగ్ నిర్వహించనున్నారు. అలాగే 96 వార్డు స్థానాలకు 18 చోట్ల నామినేషన్లు దాఖలు కాకపోగా, 66 స్థానాల్లో సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. మిగిలిన 12 స్థానాల్లో మాత్రం పోలింగ్ అనివార్యమైంది.

వెనువెంటనే ఫలితాలు..

పోలింగ్ ప్రక్రియ బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతుంది. ఈ నెల 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. పరిస్థితులను బట్టి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటించి, విజేతల పేర్లు ప్రకటించనున్నారు. ఎక్కడైనా అవసరమైతే ఈ నెల 20న రీపోలింగ్ నిర్వహిస్తారు.

పక్కాగా పోలింగ్..



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనల ప్రకారం ఈ నెల 19న ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిపిస్తాం. ఇందుకోసం 156 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఎన్నికల విధులకు నియమించాం. 43 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశాం. సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నాం.

– వి.రవికుమార్,
అదనపు జిల్లా ఎన్నికల అధికారి

సబ్జెక్టుపై పట్టు సాధించాలి



టాప్ ర్యాంకు విద్యార్థులతో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో బుధవారం ప్రీ యూనివర్సిటీ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల ఎలాట్‌మెంట్ అందజేశారు. పీయూసీ మార్కులు, విద్యార్థుల ఆప్షన్లు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా బ్రాంచ్‌లు కేటాయించారు. పీయూసీ మార్కుల ఆధారంగా 937 మందికి ర్యాంకులు కేటాయించారు. ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. మొదటి ఐదు ర్యాంకులు సాధించిన చిరికి గంగాభవాని, గొర్జ వనిత, వెలగ బాలాజీ, రావి సాయికిరణ్, బోర పల్లవిలకు డైరెక్ట్ అడ్మిషన్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఈ, సీఎస్‌ఈ, ట్రిపుల్‌ఈ, సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్స్‌కు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్స్‌కు వేళయ్యింది. 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల (సీఎల్స్) రెన్యువల్స్ కోసం ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు బుధవారం తెలిపారు. జోన్–1 పరిధి ఆర్జేడీ ఆదేశాల మేరకు 2022–23 విద్యా సంవత్సరంలో మార్చి 31 నాటికి కాంట్రాక్ట్ లెక్చరర్లగా పనిచేసిన వారు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని స్పష్టంచేశారు. పనిచేస్తున్న కళాశాలలోనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వాటిని ఈ నెల 21న ఐడీ కళాశాల (శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీరందరికీ జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించి రెన్యువల్స్ పునరుద్ధరిస్తామన్నారు. వారు ఈ నెల 24న అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

విద్యుత్ ఉద్యోగుల జీ(వి)తాల్లో వెలుగులు

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 37 శాతం వేతనాల పెంపు నిర్ణయం
- జిల్లాలో మొత్తం 453 మందికి లబ్ధి



అరసవల్లి: విద్యుత్ శాఖలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 37 శాతం జీతాలు పెంచడంతో పాటు ఆయా కాంట్రాక్ట్ సంస్థలు ఈ ఉద్యోగులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా పెంచేలా నిర్ణయించారు. ఈ నిర్ణయంతో ఉమ్మడి శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్ల పరిధిలో 453 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. వీరిలో అత్యధికంగా షిఫ్ట్ ఆపరేటర్లుగా 322 మంది, ఫ్రాంచైజీ ఉద్యోగులుగా 24 మంది, పీక్‌లోడ్ సిబ్బందిగా 18 మంది, కంప్యూటర్ ఆపరేటర్లుగా 25 మంది, కాల్‌సెంటర్‌లో 18 మంది, టెక్నికల్ అసిస్టెంట్లుగా ఆరుగురుతో పాటు డ్రైవర్లు, ఇతర క్రింద స్థాయి ఉద్యోగులు సుమారు 40 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఉద్యోగులకు స్థాయిని బట్టి కనిష్టంగా రూ.6200 నుంచి గరిష్టంగా రూ.8200 వరకు జీతం పెరిగే అవకాశాలున్నాయని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వీరందరికీ గత ఏడాది మార్చి నుంచి జీతాల పెంపు ప్రక్రియను అమలుకు నిర్ణయించనున్నారని సమాచారం. ఇటీవల తమ ఉద్యోగ జీతాలు పెంచాలని డిమాండ్లతో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నాకు సిద్ధపడనున్న నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయాన్ని ప్రకటించడంతో సదరు ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈఓ



ఆదిత్యాలయంలో మూర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంకు సీఈఓ పులిగెడ్డ వెంకట నర్సింహమూర్తి కుటుంబస మేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధ అజిత్‌కుమార్‌లు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించా రు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సభ్యులు వివరించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ గుడ్ల రమణమూర్తి, డిప్యూటీ మేనేజర్ మణిపాత్రుని సతీష్‌బాబు పాల్గొన్నారు.

62 మద్యం బాటిళ్ల సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ, ఎస్‌ఐలు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని పెద్దపేట వీధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో జామి గోవిందరావు వద్ద 62 మద్యం బాటిళ్లు లభించాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఏఎస్ దొర తెలిపారు. బాటిళ్లను సీజ్ చేసి గోవిందరావును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సంధ్యారాణి, సిబ్బంది ఎస్.ధర్మరాజు, ఎస్.వి.రమణ, కె.ఉమాపతి తదితరులు పాల్గొన్నారు. చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని చేరివీధికి చెందిన మండల జానిమ్మ అనే మహిళ ఇంట్లో ఈ నెల 14న జరిగిన చోరీకి సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. తాను ఇంట్లో లేని సమయంలో గోడ బీరువాలోంచి తులం బంగారం (రెండు చెవుదిద్దు లు) దొంగతనానికి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టెక్కలి ఎస్ఐ–2 రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. టెక్కలిలోని మండపాలం కాలనీకి చెందిన మల్లిబోయిన సతీష్, సోగ్గాడిపేటకు చెందిన బి.సోమేష్‌లు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ–2 తెలిపారు.

పత్రికా ప్రకటనకు ఖండన ప్రకటన

నా క్లయింట్లైన నల్లాన వెంకట సతీష్ S/o లేటు శ్రీనివాసరావు, గుజరాతీపేట, శ్రీకాకుళం టౌన్ & మున్సిపాలిటీ వాస్తవ్యులు ఇచ్చిన భోగట్టాపైన, తేది: 03-08-2023న నా క్లయింట్‌పైన సాక్షి దినపత్రిక శ్రీకాకుళం జిల్లా ఎడిషన్‌లో సలాన దండాసి, అడ్వకేట్, పాతపట్నం వారు వారి క్లయింటైన రేగేటి త్రినాథరావు S/o లేటు ఆదినారాయణ పేరున ఇచ్చిన ప్రకటనకు ఖండన ప్రకటన.

నా క్లయింట్ దగ్గర మీ క్లయింట్ రేగేటి త్రినాథరావు S/o లేటు ఆదినారాయణ తేది: 01-03-2015న శ్రీకాకుళం టౌన్, గుజరాతీపేట రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెం: 160/10లో AC. 0.32 సెంట్లుకు అన్ రిజిష్టర్డ్ అగ్రిమెంట్ పొంది నా క్లయింట్‌పైన శ్రీకాకుళం అదనపు జిల్లా కోర్టులో OS. 23/2020 దావా వేయడం వాస్తవం. మరియు సదరు అగ్రిమెంట్ నిర్ణయం ప్రకారం సెంటు ఒక్కింటికి రూ.2,60,000/- (రెండు లక్షల అరవై వేల రూపాయలు మాత్రమే) నిర్ణయించుకోవడం జరిగింది. సదరు దావాకు తేది: 08-04-2021న శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ముందు ఉభయ పార్టీలు OS. 23/2020 దావా షెడ్యూల్‌లో ఉన్న ఆస్తిని మీ క్లయింట్ రేగేటి త్రినాథరావు నా క్లయింట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు, నా క్లయింట్‌కు ఇవ్వవలసిన రూ.63,40,000/- (అక్షరముల అరవై మూడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే) 2 నెలల్లో చెల్లించుటకు సదరు లోక్ అదాలత్‌లో రాజీ అవుతూ మరియు సదరు రూ.63,40,000/- రెండు నెలల్లో నా క్లయింట్‌కు మీ క్లయింట్ చెల్లించని యెడల, మీ క్లయింట్ నా క్లయింట్ దగ్గర పొందిన సేల్ అగ్రిమెంట్ తేది: 01-03-2015 తప్పనిసరిగా రద్దు అవుతుందని ఉభయ పార్టీలు అవార్డు పొందటం జరిగింది. అయితే ఉద్దేశపూర్వకంగా మీ క్లయింట్ పై విషయాలన్నింటిని తన పత్రికా ప్రకటనలో తప్పించుకొని నా క్లయింట్‌పైన తేది: 03-08-2023న తప్పుడు విషయాలతో అక్రమ లాభం పొందుటకు, ప్రజలను తప్పుదోవపట్టించుటకు పత్రికా ప్రకటన చేసియున్నారు.

కాని శ్రీ శ్రీకాకుళం లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ముందు రాజీపడిన అవార్డు ప్రకారం, మీ క్లయింట్ సదరు అవార్డును ఉల్లంఘించినందున తన యొక్క హక్కులను కోల్పోవటం జరిగినది. కావున నా క్లయింట్ OS. 23/2020 షెడ్యూల్‌లో ఉన్న ఆస్తిని ఇతరులకు అమ్ముకొనుటకు సంపూర్ణమైన హక్కు, అనుభవం కలదు. తేది: 03-08-2023న ఇచ్చిన పత్రికా ప్రకటనలోని అంశములు నా క్లయింట్‌కు బంధించబడవని ఈ ఖండన ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాము.

శ్రీకాకుళం,
తేది: 16-08-2023

పల్లి రామారావు, అడ్వకేట్
న్యూ కాలనీ, శ్రీకాకుళం Cell: 95532 22221

పత్రికా ప్రకటనకు ఖండన ప్రకటన

నా క్లయింట్స్ అయిన [1] సాహుకారి మన్మధరావు చౌదరి, [2] సాహుకారి కోటేశ్వర చౌదరి, (3) సాహుకారి జగదీశ్వర చౌదరి, (4) సాహుకారి మురళీప్రసాద్ చౌదరి మరియు మనోరమ సాహు అలియాస్ ధనలక్ష్మి సాహు గార్లు ఇచ్చిన భోగట్టాపైన, తేది. 03-08-2023న నా క్లయింట్స్ పైన సాక్షి దినపత్రిక శ్రీకాకుళం జిల్లా ఎడిషన్‌లో సలాన దండాసి, అడ్వకేట్, పాతపట్నం వారు వారి క్లయింటైన రేగేటి త్రినాథరావు S/o. లేటు ఆదినారాయణ పేరున ఇచ్చిన ప్రకటనకు ఖండన ప్రకటన.

నా క్లయింట్స్ ఇచ్చిన భోగట్టా ప్రకారం నా క్లయింట్స్ తల్లిదండ్రులు గోపాల చౌదరి, దమయంతి చౌదరిలకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు మొత్తం ఏడుగురు సంతానం. ఈ విషయం మీ క్లయింట్‌కు రూఢీగా తెలుసును. శ్రీకాకుళం టౌన్‌లో, గుజరాతీపేటలో ఉన్న సర్వే నెం.162/5, సుమారు Ac.0.73 సెంట్లు ఆస్తి తేది. 30-03-2012న డాక్యుమెంట్ నెం. 2275/2012 ద్వారా పంపకం దస్తావేజు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. సదరు పంపకం దస్తావేజులోని ఆస్తి సర్వే నం. 162/5లో ఉన్న సుమారు Ac.0.73 సెంట్లు ఆస్తి ఏడుగురు మీ క్లయింట్ ద్వారా ఇతరులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ద్వారా అమ్మడం జరిగింది. సదరు షెడ్యూల్ ఆస్తి తప్ప నా క్లయింట్స్ పంచుకోవడానికి సమిష్టి స్థిరాస్తులు లేవు అని రిజిష్టర్డ్ పంపకం దస్తావేజులో కూడా వ్రాసుకోవడం జరిగినది. కావున నా క్లయింట్స్ మీ క్లయింట్‌కు సేల్ అగ్రిమెంట్‌లో వ్రాసిన ఆస్తులకు ఎటువంటి హక్కులు లేవు. ఈ విషయం మీ క్లయింట్‌కు రూఢీగా తెలుసును.

మీ క్లయింటు రేగేటి త్రినాథరావు నా క్లయింట్స్ నుండి పూర్తి సంతకాలు లేకుండా తేది: 29-06-2017న అన్ రిజిష్టర్డ్ అస్వాధీన అగ్రిమెంట్ (కంప్యూటరైజ్డ్ తెలుగు) పొందియున్నారు. సదరు అగ్రిమెంట్ కాలంలో మీ క్లయింట్ నా క్లయింట్స్‌కు రూ. 15,00,000/- (అక్షరముల పదిహేను లక్షల రూపాయలు మాత్రమే) అడ్వాన్సుగా ఇచ్చినట్లు మీ నోటీస్ ప్రకటనలో వ్రాయబడింది. కాని అదే రోజు తేది: 29-06-2017న మీ క్లయింట్ నా క్లయింట్స్ పేరున కంప్యూటరైజ్డ్ తెలుగులో అంగీకార పత్రం ఇవ్వడం జరిగింది. సదరు అంగీకార పత్రంలో తేది: 29-06-2017న మీ క్లయింట్ పేరున అగ్రిమెంట్‌లో ఉన్న అడ్వాన్స్ రూ. 15,00,000/- (అక్షరముల పదిహేను లక్షల రూపాయలు మాత్రమే) నా క్లయింట్స్‌కు ఇవ్వలేదని అంగీకరించబడియున్నది. సదరు అగ్రిమెంట్‌లో ఉన్న సాక్షులు, దస్తూరి మరియు అదే రోజున వ్రాసిన అంగీకారపత్రంలో కూడా పూర్తి సాక్షులు మరియు దస్తూరి ఒక్కరే. ఈ విషయం మీ క్లయింట్‌కు రూఢీగా తెలుసును. కాని మీరు ఇచ్చిన పత్రికా ప్రకటనలో పై అంశములన్నియు ఉద్దేశపూర్వకముగా తెలియజేయకుండా అక్రమ లాభం కోసం తప్పుడు ప్రకటన చేసియున్నారు.

మీ క్లయింట్ వేసిన దావా O.S. 34/2021 శ్రీకాకుళం జిల్లా 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఉన్న కేసులో నా క్లయింట్స్ పై అంశములన్నియు తెలియజేస్తూ, మీ క్లయింట్ అగ్రిమెంట్ నా క్లయింట్స్ అంగీకార పత్రంలో ఉన్న సాక్షులు, దస్తూరి వేరు వేరు కాదని, సదరు అగ్రిమెంట్‌లో నా క్లయింట్స్ తాలూకా అందరి సంతకాలు లేవు గనుక మీ క్లయింట్ నా క్లయింట్స్‌కు వ్రాసిన అంగీకార పత్రంలో నిజం ఒప్పుకున్నందున శ్రీ జిల్లా జడ్జి వారి కోర్టులో పై అంశములన్నియు దాఖలు చేయడమైనది. ఈ విషయం మీ క్లయింట్ మీ ద్వారా తెలుసుకొని నా క్లయింట్స్ పైన వారి యొక్క పరువు ప్రతిష్టలకు భంగం కలిగించుటకు తేది. 03-08-2023న పత్రికల ద్వారా తప్పుడు ప్రకటన చేసియున్నారు. సదరు ప్రకటనలోని అంశములు ఏవి కూడా నా క్లయింట్స్‌కు గాని సదరు షెడ్యూల్ ఆస్తి ఒరిజినల్ ఓనర్‌కు కూడా బంధింపబడవు. సదరు నోటీసు షెడ్యూల్ ఆస్తి యొక్క ఒరిజినల్ ఓనర్ తన అవసరం నిమిత్తం ఇతరులకు అమ్ముటకు గాని, డెవలప్‌మెంట్‌కు ఇచ్చుకొనుటకు గాని, కన్‌స్ట్రక్షన్ చేసుకొనుటకు గాని పూర్తి హక్కులు, అధికారములు కలవని ఈ ఖండన ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాము.

శ్రీకాకుళం,
తేది: 16-08-2023

పల్లి రామారావు, అడ్వకేట్
న్యూకాలనీ, శ్రీకాకుళం. Cell: 95532 22221

కాలిబాటలు.. దిగుబడికి రాచబాటలు

- ఖరీఫ్ వరిసాగులో అవలంబిస్తే మేలు
- సుడిదోమ నివారణకు చక్కటి ప్రత్యామ్నాయం
- ఎరువులు, పురుగు మందుల వాడకానికి అనుకూల మార్గం



పాతకొజ్జీరియాలో రైతు ఉప్పాడ వాసుదేవరావు పొలంలో కాలిబాటలతో కూడిన వరిపైరు

కవిటి: ఖరీఫ్ వరిసాగులో కాలిబాటలు(పాయలు)గా పిలిచే సాగుపద్ధతికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రక్రియను వ్యవసాయ శాస్త్రవేత్తలు మూడు దశాబ్దాల క్రితం నుంచి సిఫారసు చేస్తున్నారు. ఫలితాలు కూడా అద్భుతంగా ఉన్నాయని పలువురు అభ్యుదయ రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తూర్పు పడమరగా, రబీ సీజన్‌లో ఉత్తర దక్షిణ దిశలుగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 20 సెంటీమీటర్ల వెడల్పుతో ప్రతిరెండు మీటర్ల నిడివికి ఒకటి చొప్పున ప్రధానపొలం అంతటా బాటలు తీయాలి. కాలిబాటలు తీసేటప్పుడు అక్కడ నాటిని మొనలు తగ్గిపోయి దిగుబడి తగ్గుతుందనే అపోహ ఇప్పటికీ పలువురు రైతుల్లో నెలకొంది. కానీ 20 సెంటీమీటర్ల ప్రాంతంలో తీసిన మొనలు పక్కనున్న ఖాళీల్లో నాటుతారు. కావున దిగుబడిపై ఎటువంటి ప్రతికూల ప్రభావాలు ఉండవు.

ఉపయోగాలివే..

- పంటపొలంలో అంతర కృషిచేసేందుకు, ఎరువులు వేయటానికి, పురుగు మందులు పిచికారీ చేసే సందర్భాల్లో బాటలు వీలుగా ఉంటాయి.
- పొలం విస్తీర్ణం అంతా సమాన పరిమాణంలో ఎరువులు, పురుగు మందులు చల్లటం సాధ్యపడుతుంది.
- సెప్టెంబరు నెలాఖరునాటికి పూర్తిగా దుబ్బు చేసి వెన్ను అంకురం ఏర్పడే దశకు చేను వస్తుంది. ఆ దశలో వరి మొదలు నీటిమట్టం ఉండే ప్రదేశంలో గట్టిపడి తీపి ఎక్కువ అవుతుంది.
- కాలిబాటలు తీయకపోతే మొదలుభాగంలో చీకటిగా ఉండి వెలుతురు అందదు. ఆ ప్రదేశంలో మురుగునీరు బయటకు పోదు. దీనివల్ల చెడు వాసనతో కూడిన వాతావరణం మొదళ్లలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో సుడిదోమ ఉద్ధృతి పెరిగే అవకా శం ఉంటుంది. అటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకు రైతులు నాట్లువేసేటపుడే కాలిబాటలు(పాయలు) కనీసం పది రోజుల వ్యవధిలో తీసుకోవాలి.

రైతుల్లో ఆసక్తి ఉండాలి..



సుడిదోమ నివారించడంలో ముందస్తుగా నాట్లు వేసినపుడే కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి రైతుల్లో ఉండాలి. అవసరమైతే ఇద్దరు కూలీలను అదనంగా పెట్టాల్సి ఉంటుంది. కానీ సుడిదోమ నివారణ, ఇతర ఉపయోగాలు పొందేందుకు కాలిబాటల ఏర్పాటు ఎంతో మంచి పద్ధతి.

– బొర్ర నరసింహమూర్తి, వ్యవసాయాధికారి

ఇరవై ఏళ్లుగా..



ఖరీఫ్ వరిసాగు పట్ల ఎంతో శ్రద్ధ పెడతాను. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు సలహాలు నిరంతరం తీసుకుంటాను. ఏటా విత్తన మార్పిడి చేస్తుంటాను. 20 ఏళ్లు వరిలో కాలిబాటలు ఏర్పాటుచేయడం అలవాటుగా మారిపోయింది. నాట్లువేసినప్పుడే ముందుగా మార్కింగ్ ఇచ్చి కాలిబాటలు ఏర్పాటు చేస్తున్నాను.ఈ విధానంలో ప్రతిఫలం కనిపిస్తోంది.

– ఉప్పాడ వాసుదేవరావు, రైతు, పాతకొజ్జీరియా, కవిటి మండలం

లక్కవరం వాసికి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



మెడల్ అందుకుంటున్న పండి సీతారాం

సోంపేట: మండలంలో పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామానికి చెందిన రిజర్వ్ కమాండెంట్ (గ్రే హౌండ్స్ ఎస్పీ, విశాఖ) పండి సీతారాం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్న నేపథ్యంలో బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈయన 1991లో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు.

సెంట్రల్ జీఎస్టీ ఎస్‌ఐకు సన్మానం



కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస/కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన సెంట్రల్ జీఎస్టీ ఎస్‌ఐ సాహుకారి కిరణ్‌కుమార్‌కు రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం తన కార్యాలయంలో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. కిరణ్‌కుమార్ గత ఏడాది నాలుగు కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగాలకు ఒకేసారి ఎంపికయ్యారు. అందులో సెంట్రల్ జీఎస్టీ ఎస్‌ఐ పోస్టును ఎంపిక చేసుకుని ప్రస్తుతం బెంగళూరులో విధులు నిర్వర్తిస్తున్నారు. సెలవులో మొదటిసారి స్వగ్రామానికి రావడంతో స్థానికులతో పాటు మంత్రి ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల రామారావు, కిరణ్‌కుమార్ సాహుకారి వల్లభరావు మాస్టారు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



దువ్వాడ వాణి సమక్షంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సెర్ప్ ఉద్యోగులు బుధవారం టెక్కలిలో వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి సమక్షంలో పాలాభిషేకం చేశారు. ఇటీవల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంతి పథం ఉద్యోగులంతా వాణి సమక్షంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ ఎస్.శ్రీరాములు, ఏపీఎం జి.నారాయణరావు పాల్గొన్నారు.

ఇంజినీర్ల సస్పెన్షన్ పాపం కూన బ్రదర్స్‌దే

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాని



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రెల్లిగెడ్డ పనులను సుమారు రూ.10 కోట్లతో అప్పటి విప్ కూన రవికుమార్ అండ్ కో పనులను నాణ్యత లేకుండా చేపట్టి నిధులను నీటిపాలు చేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యర్శి తమ్మినేని చిరంజీవినాగ్ (నాని) ధ్వజమెత్తారు. శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కూన బ్రదర్స్ బెదిరింపులకు భయపడి ఇంజినీర్లు పనులు పర్యవేక్షించేందుకు సైతం వెళ్లలేకపోవడంతో నాణ్యత కరువైందని, ఫలితంగా 8 మంది ఇంజినీర్లు సస్పెన్షన్‌కు గురయ్యారని, ఆ పాపం కూన బ్రదర్స్‌దేనని చెప్పారు. తాడివలస, మొదలవలసతో పాటు సుమారు 20 గ్రామాల్లో భూములకు సాగునీరిచ్చే ప్రాజెక్టును పూర్తిగా అవినీతిమయం చేశారని మండిపడ్డారు. ఇసుక మాఫియా డాన్‌గా, అవినీతి సామ్రాట్‌గా, అధికారులను బూతులు తిట్టే వ్యక్తిగా కూనకు పేరుందన్నారు. ఆయా ప్రాంత రైతులు ఓట్లేసి గెలిపిస్తే వారికి తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. బ్రిటీష్ వారు నిర్మించిన చెక్‌డ్యామ్‌లను పగలగొట్టేందుకు నెల రోజులు పట్టిందని, టీడీపీ హయాంలో చేపట్టిన ఈ నిర్మాణం మాత్రం నెల రోజుల్లో ఒక్క వరదకే కొట్టుకుపోయిందన్నారు. కూన సత్యనారాయణరావు వేసిన సింగూరు రోడ్డు సైతం మూణ్నాళ్లకే ముక్కలైపోయిందన్నారు. ఇటీవల జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన చంద్రబాబు రెల్లిగెడ్డ పనులను పరిశీలించి ఉంటే బాగుండేదన్నారు. ఏ–1 కాంట్రాక్టర్ కూన సత్యనారాయణకు అవినీతిలో ఏ–1 ముద్దాయిగా శిక్షవేయాలన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇసుక, మట్టి, నీరు, చెట్టు అని తేడాలేకుండా ప్రకృతిని దోచుకుని జేబులు నింపుకున్నారని ధ్వజమెత్తారు. రెల్లిగెడ్డ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ ప్రాంత రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాశ్వత పరిష్కారానికి అడుగులు వేసి రైతులకు సాగునీరందిస్తామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి చేయూత



కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న సేవా సంఘ సభ్యులు

రణస్థలం: మండలంలోని జీరుపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి వాసుపల్లి ఎర్రయ్య దంపతుల రెండున్నర నెలల పాప గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఆపరేషన్ కోసం రూ. 6లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. విషయం తెలుసుకున్న 'చేయి చేయి కలుపుదాం' సేవా సంఘం ప్రతినిధులు తమ వంతుగా లక్షా యాభై వేలు రూపాయలు సేకరించి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రణస్థలం వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఆవరణలో కొండచిలువ హతం



హతమైన కొండ చిలువ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం కొండ చిలువ కలకలం రేపింది. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి కర్రలతో హతమార్చారు. కొండ ప్రాంతం కావటంతో వర్షాలకు బయటకు పాములు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు.

బకాయిదారుల ఆస్తుల స్వాధీనం



భూములను స్వాధీనం చేసుకుంటున్న పీఏసీఎస్ అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రాథమిక వ్యవసాయ పరపతి కార్యాలయం ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని బకాయిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వరరావు తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు, కొండవూరు, బట్టుపాడు, రెయ్యిపాడు గ్రామాలకు చెందిన నలుగురు రైతులకు రూ. 24 లక్షలు మార్ట్‌గేజ్ లన్ అందించామని, తిరిగి చెల్లించాలని నోటీసులు పంపించినా స్పందించకపోవడంతో పోలీసుల సహాయంతో బుధవారం రైతులకు సంబంధించిన భూములలో జెండాలను పెట్టి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రుణాలు చెల్లించకపోతే భూములను వేలం వేస్తామని చెప్పారు. ఆయనతో పాటు సేల్ ఆఫీసర్ టి.యర్రయ్య, మేనేజర్ డి.కృష్ణారావు, నోడల్ ఆఫీసర్ జి.సునీల్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఐ కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న పోలీస్ అసోసియేషన్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో పనిచేసిన ఆర్‌ఎస్‌ఐ శేషయ్య ఈ నెల 14న అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కుటుంబాన్ని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాలమేరకు పోలీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పరామర్శించారు. కుమార్తెలు సుధారాణి, మాధురిలకు పోలీస్ మరణ సహాయ నిధి నుంచి తక్షణ సహాయంగా రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు కృష్ణంనాయుడు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు సరికాదు



డీఈవో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఎంత మాత్రం సరికాదని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు తంగి మురళీమోహనరావు, రాష్ట్ర నాయకులు పప్పల రాజశేఖరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో కె.వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీల్లో మిగులు ఉపాధ్యాయులగా చూపించి నిర్బంధంగా బదిలీ చేసి, మళ్లీ ఇప్పుడు అదే పాఠశాల, అదే రోజులకు మరలా ఉపాధ్యాయులు అవసరమని సర్దుబాటు చేయడమనేది ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కాగా, అంతకుముందు పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సర్దుబాటు జీవోలను వ్యతిరేకిస్తూ పీఆర్‌టీయూ సంఘం తీర్మానించింది. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.సీతరాజు, బమ్మిడి మన్మధరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖలింగేశ్వరున్ని దర్శించుకున్న ఇంజినీర్లు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కె.వి.కృష్ణారెడ్డి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరున్ని బుధవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం సీఎస్సీ(ఇంజినీరింగ్ చీఫ్) కె.వి.కృష్ణారెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ విశేషాలు వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు చీఫ్ ఇంజినీర్ సంజీవ్ రెడ్డి, శ్రీకాకుళం, విజయనగరం ఎస్ఈలు టీఎస్ ప్రసాద్, ఉమాశంకర్, క్వాలిటీ కంట్రోల్ డీఈ ఎస్.రామకృష్ణ, డీఈ జల్లు సుదర్శనరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ మేనేజర్‌కు రాష్ట్రస్థాయి ప్రశంసలు



మేరీగ్రేస్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా

శ్రీకాకుళం పాతబస్టాండ్: విజయవాడలోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో 2022- 23 సంవత్సరంలో ఆ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీకాకుళం జిల్లా హౌసింగ్ మేనేజర్ టి.మేరీగ్రేస్‌కు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.లక్ష్మీషా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేరీగ్రేస్‌కు జిల్లా హౌసింగ్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పోర్టు వాహనాల అడ్డగింత

సంతబొమ్మాళి : మూలపేట పోర్టుకు సంబంధించి ప్రత్యేక రహదారులు నిర్మించుకొని వాటి పైనుంచి పోర్టు వాహనాలను నడపాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ పోర్టు వాహనాలను బుధవారం అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలు రావడం వల్ల రోడ్లు ధ్వంసమయ్యాయని, కనీస సౌకర్యాలు కల్పించకుండా పోర్ట్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసన కారులను జీపు ఎక్కించారు. నిరసన తెలిపిన వారిలో మూలపేట సర్పంచ్ బాబురావు తదితరులు ఉన్నారు.

ఆర్‌జేడీకి సత్కారం



ఆర్జేడీ శారదను సన్మానిస్తున్న జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర సలహాదారులు

మందస: ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద(రాజమహేంద్రవరం)ను జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర సలహాదారుడు, మందస జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు బుధవారం కలిశారు. ఇటీవల జూనియర్ అధ్యాపకుల బదిలీల్లో పారదర్శకతతో అధికారులు వ్యవహరించారని, ఈ సందర్భంగా ఆర్జేడీని దుశ్శాలువతో సన్మానించారు. ఇంటర్ విద్యలో ప్రవేశాలు పెంచాలని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని ఆమె కోరారని తెలిపారు. ఇప్పటికే నాడు-నేడు పథకం కింద మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు విడుదలయ్యాయని, వాటితో కళాశాల అభివృద్ధి చేయాలన్నారు. ఆయనతో పాటు సలహాదారుడు బాడ వెంకటమోహన్ ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	60,380–00
బంగారం(22కే. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99481 66555 [B-1193214]

WANTED

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]

■ IRPM కంపెనీ శ్రీకాకుళం మండలాల్లో నూతనంగా ప్రారంభించే బ్రాంచిలో BMMT లో చేయుటకు Q. 10, ఇంటర్ చదివిన 50 మంది యువతి యువకులు కావలెను. Income 12000-22000. 9849553548 [WA-7212]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [HA-502]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి MF ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd ఫోన్ : 9391753308 [HA-504]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.